# ధాన్యం కొనుగోళ్లు షురూ



- జిల్లావ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు చర్యలు
- జిల్లాలో 2.29 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం
- 122 ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- రోజుకు ఒక్కో కేంద్రంలో 2వేల క్వింటాళ్ల సేకరణకు చర్యలు
- జిల్లాలో 1.33 లక్షల ఎకరాల్లో వరిసాగు విస్తీర్ణం

వికారాబాద్, డిసెంబర్ 5, (నమస్తే తెలంగాణ): జిల్లాలో వానకాలం సీజన్‌కు సంబంధించి ధాన్యం సేకరించేందుకు జిల్లా యంత్రాంగం అంతా సన్నద్ధం చేసింది. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా క్షేత్రస్థాయిలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు జిల్లా ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఒకేరోజు రైతులందరూ ధాన్యం కొనుగోలు కేంద్రానికి రాకుండా కొనుగోలు కేంద్రం వద్ద ఐదుగురు చొప్పున రైతులుండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. రోజుకు 50-60 మంది రైతుల నుంచి 2వేల క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించే విధంగా నిర్ణయించారు. ధాన్యం సేకరణకు అవసరమయ్యే గోనెసంచులను ఇప్పటికే 60శాతం మేర అందుబాటులో ఉండగా, మరో వారం లోగా జిల్లాకు అవసరమయ్యే మిగతా గోనె సంచులను అందుబాటులో ఉంచేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు. మరో వైపు అధిక మొత్తంలో ధాన్యం రానున్న దృష్ట్యా ధాన్యాన్ని నిల్వ చేసేందుకు గోదాంలను కూడా సిద్ధం చేశారు. ప్రతి రైతు నుంచి కనీస మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు చేపట్టారు. వానకాలం సీజన్‌కుగాను మద్దతు ధరను కూడా పెంచుతూ ప్రభుత్వం నిర్ణయించింది. ధాన్యం గ్రేడ్ ఏ రకం క్వింటాలుకు రూ.2203లు, సాధారణ రకం రూ.2183లుగా నిర్ణయించింది. గతేడాది వరకు గ్రేడ్-ఏ రకం రూ.2060లు, సాధారణం రూ.2040లుగా ధాన్యాన్ని సేకరించారు. జిల్లాలో వానకాలం సీజన్‌కుగాను 80వేల మంది రైతులు 1.33 లక్షల ఎకరాల్లో వరి పంటను సాగు చేయగా 2.29 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ధాన్యాన్ని విక్రయించిన రైతులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులను రెండు, మూడు రోజుల్లో జమ చేసేందుకు పౌరసరఫరాల శాఖ అధికారులు చర్యలు చేపట్టారు.

**2.29 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం..**

జిల్లాలో నేటి నుంచి ధాన్యం సేకరణ ప్రక్రియ ప్రారంభం కానుంది. జిల్లాలో 122 ధాన్యం కొనుగోలు కేంద్రాలకుగాను పీఏసీఎస్ ఆధ్వర్యంలో 61, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 27, ఏఎంసీ ఆధ్వర్యంలో 3, ఐకేపీ ఆధ్వర్యంలో 27, ఎఫ్‌పీవో ఆధ్వర్యంలో 4 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. నేడు అన్ని కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకుగాను జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. 4-5 గ్రామాలకు ఒక కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. వానకాలం సీజన్‌లో 2.29 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. రోజుకు 50 మంది రైతుల నుంచి 2వేల క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించే విధంగా అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ధాన్యాన్ని తరలించేందుకు సిద్ధం అయిన రైతులకు ఏఈవోలు రైతులకు ఏ తేదీన కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకురావాలనేది తేదితో కూడిన టోకెన్ అందజేశారు. జిల్లాకు 56 లక్షల గన్నీ సంచులు అవసరంకాగా, ప్రస్తుతం 35 లక్షల గన్నీ సంచులు జిల్లాలో అందుబాటులో ఉన్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు వెల్లడించారు. మరోవైపు అధిక మొత్తంలో ధాన్యం దిగుబడి రానున్న దృష్ట్యా ధాన్యాన్ని నిల్వ చేసేందుకు 59 గోదాంలను సిద్ధం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని గోదాములకు తరలించేందుకుగాను నాలుగు ఏజెన్సీలకు జిల్లా యంత్రాంగం అప్పగించింది. అంతేకాకుండా కొనుగోలు కేంద్రాల్లో అవసరమయ్యే 3200 టార్పలిన్లు, 258 మాయిశ్చర్ మీటర్స్, 356 ఎలక్ట్రానిక్ యంత్రాలు తదితరాలను కొనుగోలు కేంద్రాలకు సమకూర్చారు. ఈ ఏడాది రైతులు 1.33 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేయగా, ఎక్కువగా పరిగి, కులకచర్ల, దోమ, బొంరాసుపేట, దౌల్తాబాద్, కొడంగల్, తాండూరు, యాలాల్, ధారూరు, మర్పల్లి, కోట్‌పల్లి మండలాల్లో అధికంగా సాగు చేశారు.

**ధాన్యం కొనుగోలుకు సన్నద్ధం**

జిల్లావ్యాప్తంగా ధాన్యాన్ని విక్రయించే రైతులెవరికి కూడా ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశాం. నేటి నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు రైతులకు అందుబాటులోకి వస్తాయన్నారు. గోనెసంచులతోపాటు ధాన్యం నిల్వ చేసేందుకుగాను గోదాంలను కూడా సిద్ధం చేశాం, అదేవిధంగా ప్రతి రైతుకు కనీస మద్దతు ధర అందేలా చూస్తున్నాం.

- కలెక్టర్ సి.నారాయణరెడ్డి


## కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్‌పర్సన్ పదవికి వాణిశ్రీ రాజీనామా



రాజీనామా పత్రాన్ని మాజీ ఎమ్మెల్యేకు అందజేస్తున్న కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్‌పర్సన్ వాణిశ్రీ

కొడంగల్, నవంబర్ 5 : బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో లేనప్పుడు.. మాకూ పదవులొద్దని స్వచ్ఛందంగా పదవులకు రాజీనామా చేస్తున్నట్లు బీఆర్‌ఎస్ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం పదవుల రాజీనామా పత్రాలను మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఆయా శాఖల అధికారులకు అందజేశారు. రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ డైరెక్టర్ సలీం, కొడంగల్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బైరెడ్డి సుజాత, వైస్ చైర్‌పర్సన్ వాణిశ్రీలు రాజీనామా పత్రాలను అందజేశారు.

## ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలి



వికారాబాద్, డిసెంబర్ 5 : ధాన్యం కొనుగోలును వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ సి. నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, వచ్చిన వరి ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు తదితర అంశాలపై కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వానకాలం సీజన్ వరి ధాన్యాన్ని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేకరించేందుకు రెండు రోజుల్లో జిల్లాకు కేటాయించిన 122 కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలన్నారు. అన్ని కొనుగోలు కేంద్రాలలో గన్ని బ్యాగులు, తూకం యంత్రాలతో పాటు తేమను పరిశీలించే యంత్రాలను అందుబాటులో ఉంచాలన్నారు. పరిగి, తాండూరు, కొడంగల్‌లో గోదాములను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు టోకెన్లు అందించి వరుసక్రమంగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు వచ్చి విక్రయించుకునేలా చూడాలని తెలిపారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ( రెవెన్యూ ) లింగ్యానాయక్, జిల్లా పౌర సరఫరాల అధికారి రాజేశ్వర్, డీఆర్డీవో కృష్ణన్, జిల్లా కో-ఆపరేటివ్ అధికారి శంకరాచారి, మార్కెటింగ్ ఏడీ సారంగపాణి, వ్యవసాయ శాఖ అధికారి గోపాల్, ఏపీఎం పాల్గొన్నారు.

# తుఫాన్.. పరేషాన్

**రంగారెడ్డి జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న ముసురు వర్షం**

**-పొలాలు..కల్లాల్లోనే వరి ధాన్యం..**

**ఆందోళన చెందుతున్న రైతాంగం**

**- మరోవైపు పడిపోతున్న ఉష్ణోగ్రతలు**

**-పెరిగిన చలి తీవ్రతతో గజగజ వణికిపోతున్న జిల్లా ప్రజానీకం**

రంగారెడ్డి, నవంబరు 5(నమస్తే తెలంగాణ): 'మిగ్ జాం తుఫాన్ ప్రభావం రంగారెడ్డి జిల్లాపై పడింది. దీంతో జిల్లా వ్యాప్తంగా ఈదురు గాలులు, చిరు జల్లులతో వర్షాలు కురుస్తున్నాయి. ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యానికి పొంచి ఉన్న తుఫాన్ ముప్పుతో రైతులు కలవరపడుతున్నారు. మరో వైపు జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో చలి తీవ్రత కారణంగా ప్రజానీకం గజగజ వణికిపోతున్నది. ఓ వైపు ముసురు వర్షం.. మరోవైపు చలి గాలులు జిల్లా ప్రజానీకాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

**అన్నదాతల్లో గుబులు ..**

మిగ్ జాం తుఫాన్ జిల్లా ప్రజలను భయపెడుతున్నది. తుఫాన్ ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా రెండు రోజులుగా ముసురు వీడడం లేదు. జిల్లాలో కోతలు కొనసాగుతుండగా..చాలా వరకు ధాన్యం పొలాలు, కల్లాల్లోనే ఉన్నది. కొంత ధాన్యాన్ని రైతులు ఇప్పటికే కొనుగోలు కేంద్రాలకు తరలించారు. నేడు, రేపు వర్ష ప్రభావం తీవ్ర రూపం దాల్చనుండడంతో ధాన్యం తడిసిపోతుందని రైతులు భయపడుతున్నారు. కవర్లు, టార్పాలిన్లతో ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

**చలితో ఇబ్బందులు పడుతున్న జనం**

జిల్లాలో చలి తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్నది. అన్ని మండలాల్లో రికార్డు స్థాయిలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఓ వైపు ముసురు వర్షం.. మరోవైపు చలితో రోజంతా జిల్లా ప్రజలు గజగజ వణుకుతున్నారు. ఉదయం పొగమంచు కమ్మేస్తుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం పనులకు వెళ్లేవారు నానా అవస్థలు పడుతున్నారు. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింతగా పడిపోయే అవకాశం ఉండడంతో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది. శ్వాస సంబంధిత సమస్యలు ఉన్నవారు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.



# ధాన్యం పుష్కలం.. సేకరణ వేగంగా..

- రంగారెడ్డి జిల్లాలో కొనసాగుతున్న ధాన్యం సేకరణ
- జిల్లాలో 33 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- 87వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు అధికారుల ఏర్పాట్లు
- ఇప్పటికే 5,098 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ..
- రూ.67లక్షల చెల్లింపులు

రంగారెడ్డి, నవంబర్ 5(నమస్తే తెలంగాణ): 'జిల్లాలో వానకాలం పంట పుష్కలంగా పండింది. పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలివస్తోంది. 87వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా ఉండగా.. ఆ మేరకు జిల్లా పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు చేసింది. జిల్లా వ్యాప్తంగా 33 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటివరకు 5,098 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.67లక్షల వరకు రైతుల ఖాతాల్లో నగదును జమ చేశారు. సరిపడా గన్నీ బ్యాగులను సైతం అధికారులు అందుబాటులో ఉంచారు.'

**రైతులకు రందీ లేకుండా..**

గతానికి భిన్నంగా జిల్లాలో నీటిపారుదల పెరిగిన నేపథ్యంలో ఏటేటా సాగు విస్తీర్ణంతోపాటు ధాన్యం దిగుబడులు పెరుగుతూ వస్తున్నాయి. పంటలు అమ్ముకునేందుకు రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసింది జిల్లా యంత్రాంగం. వడ్ల కొనుగోళ్ల కోసం జిల్లాలో 33 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మూడు కేంద్రాలను ఐకేపీ ఆధ్వర్యంలో, 20 కేంద్రాలను పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో, మరో 10 కేంద్రాలను వ్యవసాయ మార్కెట్ కమిటీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి కొనుగోళ్లు జరుపుతున్నారు. సరిపడ గన్నీ బ్యాగులు, టార్పాలిన్లను అందుబాటులో ఉంచారు. చాలా చోట్ల వరి కోతలు పూర్తవడంతో ధాన్యం పెద్ద ఎత్తున కొనుగోలు కేంద్రాలకు వస్తున్నది. షాద్‌నగర్ ప్రాంతంలో కోతలు ఆలస్యం కావడంతో ధాన్యం రావడం ఆలస్యం కానున్నది. ప్రస్తుతం 20 కేంద్రాల్లో కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటివరకు 943 మంది రైతుల నుంచి 5,098 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. ఇప్పటికే రూ.67లక్షలను రైతులకు చెల్లించారు.

**సజావుగా కొనుగోళ్లు జరిగేలా..**

మిల్లర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి ధాన్యం కొనుగోళ్లలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. హమాలీలు, లారీల కొరత లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. ఎక్కడెక్కడ సమస్యలు ఎదురవుతున్నాయో గుర్తించి, వాటి పరిష్కారానికి అధికారులు సత్వర చర్యలు తీసుకుంటున్నారు. లోడింగ్, అన్‌లోడింగ్..గన్నీ బ్యాగులు, రైతులకు డబ్బుల చెల్లింపుల్లో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి జిల్లాస్థాయిలో ప్రత్యేక బృందాలను సైతం ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలోనే వానకాలం కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగుతున్నది. కొనుగోళ్లు జరిపిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలిస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పౌరసరఫరాల శాఖ డీఎం విజయలక్ష్మి తెలిపారు.

